సాక్షి
బాపట్ల
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,65,826 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. దిగువకు 4,24,176 క్యూసెక్కులు వదులుతున్నారు.



మల్లేశ్వరుని సేవలో మంత్రి

పెదకాకాని: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం పెదకాకానిలోని శివాలయానికి విచ్చేశారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



జ్యోతికి ఉద్యోగ కల్పన

గుంటూరు వెస్ట్ : అంధత్వంతో బాధపడుతున్న జ్యోతి అనే మహిళకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నియామక పత్రం అందించారు.

న్యూస్‌రీల్

అమరావతిలో ఉత్సాహంగా టూరిజం వాక్



అమరావతి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ధ్యానబుద్ధ ప్రాంగణంలో శనివారం పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టూరిజం వాక్, స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా టూరిజం అధికారి నాయుడమ్మ, ఎంపీడీవో పార్వతి ,మండల తహసీల్దార్ డానియల్, ఎంఈవోలు ప్రసాద్ , శివబాబు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొని పర్యాటకులకు పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ,పర్యాటక అభివృద్ధి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించడం జరిగింది. ధ్యాన బుద్ధ ఆవరణలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు, ఈ సందర్భంగా జిల్లా పర్యాటక శాఖాధికారి నాయుడమ్మ మాట్లాడుతూ పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని, ప్రతి ఒక్కరూ పర్యావరణ సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పర్యాటక శాఖ యూనిట్ మేనేజర్ మణి కుమార్,టూరిజం సిబ్బంది మస్తాన్ వలి, ఆనంద్, వివిధ మండల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా



గుంటూరు వెస్ట్ : అనారోగ్య బారిన పడిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడ వద్దని గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం స్థానిక పాత గుంటూరు యాదవ బజార్ లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని వైద్యులను సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలందరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లుల కౌంటర్లు పనిచేస్తాయి


ఏపీ సీపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ రమేష్

కొరిటిపాడు(గుంటూరు): నెలాఖరు నేపథ్యంలో గుంటూరు సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లులు చెల్లించేలా ఆదివారం సెలవు రోజు అయినా కౌంటర్లు పనిచేస్తాయని ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ చల్లా రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయన్నారు. అంతేకాకుండా ఇంటి నుంచే నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించేలా మొబైల్‌లో ఏపీ సీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోన్ పే, గూగుల్ పే నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని ఆయన తెలియజేశారు.

జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారిణికి అవార్డు



గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం సంస్థలో భాగమైన గుంటూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. రాజకుమారికి ప్రకృతి వ్యవసాయ రాష్ట్రస్థాయి విస్తరణ అధికారిగా అవార్డు లభించింది. ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కిసాన్ మహోత్సవం-2025లో ఎంఎల్సీ సోమువీర్రాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబుల చేతుల మీదుగా ప్రకృతి వ్యవసాయ రాష్ట్రస్థాయి విస్తరణ అధికారిగా అవార్డును ఆమె వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామీణ స్థాయిలో విస్తరించడానికి, రైతులలో అవగాహన పెంచడానికి, ఎన్నో అవగాహన కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడానికి చేసిన కృషిని గుర్తిస్తూ ఆమెకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఏరువాక ఫౌండర్ రాఘవరావు, శాస్త్రవేత్త కవిత, రైతులు పాల్గొన్నారు.



కనగాల పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరణ



జొన్నతాళి గ్రామంలో కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు



గుళ్లపల్లి ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో లలితాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

కరుణించవమ్మా...

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. దసరా సందర్భంగా ఉత్సవాలు శనివారంతో ఆరో రోజుకు చేరాయి. జిల్లాలోని వివిధ దేవస్థానాలలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కరుణించవమ్మా.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి గ్రామంలో అమ్మవారిని రూ.1.41 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించి, పూజలు నిర్వహించారు. చెరుకుపల్లి మండలంలోని గుళ్లపల్లి ఆనందీశ్వర స్వామి దేవస్థానంలో శ్రీమహంకాళి అమ్మవారు, చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య సత్రంలో, బాలకోటేశ్వర స్వామి ఆలయంలో కనగాల పద్మశాలి యూత్ ఆధ్వర్యంలో కరెన్సీ నోట్లతో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని కనులారా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తి గీతాలు ఆలపించారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన నిర్వాహకులు.. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

- మార్టూరు/చెరుకుపల్లి

పార్టీ శ్రేణులకు భరోసా.. 'డిజిటల్ బుక్'

- కూటమి ప్రభుత్వ వేధింపుల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణుల రక్షణకు యాప్
- కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని నేతల హామీ
- బాపట్లలోని పార్టీ కార్యాలయంలో యాప్ ఆవిష్కరించిన ముఖ్య నేతలు



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కరపత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ నాయకులు

బాపట్ల: వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ భరోసాగా ఉంటుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం ఆరాచకాలు చేస్తోందని పేర్కొన్నారు. పరిపాలనకు పక్కన పెట్టి ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తోందని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజల తరపున పోరాటం చేస్తున్నందుకు వైఎస్సార్‌సీపీ వారిని వేధిస్తోందన్నారు. డిజిటల్ బుక్‌లో తమ సమస్యలను నమోదు చేసుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇవ్వటం గొప్ప విషయమన్నారు. శ్రేణులు ఇబ్బందులు ఎదురైతే ఈ యాప్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయాలని కోరారు.

భయపడొద్దు... అండగా పార్టీ ఉంది..

కూటమి ప్రభుత్వ అరాచకాలకు భయపడొద్దని, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి పేర్కొన్నారు. దుర్మార్గమైన పాలన రాష్ట్రంలో నడుస్తోందన్నారు. లోకేష్ రెడ్‌బుక్ పాలన చూస్తున్న మనకు త్వరలో డిజిటల్ బుక్ పాలన అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాబోతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నక్కా వీరారెడ్డి, జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఇనగలూరి మాల్యాద్రి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, ఎస్సీ సెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా, అడే చందు, మోర్ల సముద్రాలగౌడ్, బడుగు ప్రకాశ్, కటికల యోహోషువా తదితరులు ఉన్నారు.

విచారణకు హాజరైన పీఆర్కే సోదరులు

మాచర్ల : పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామానికి సంబంధించిన బోదిలవీడు సమీపంలో కొంతకాలం క్రితం జరిగిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో విచారణ జరిపేందుకు మాచర్ల రూరల్ పోలీసులు శనివారం హాజరు కావాలని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వారు రూరల్ పోలీసు స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. టీడీపీ నేతల హత్య కేసులో అంతర్గత ఆధిపత్య పోరు నేపథ్యంలో ఈ రెండు హత్యలు జరిగినా వీరు నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో వీరికి సుప్రీంకోర్టులో మధ్యంతర బెయిల్ వచ్చింది. శనివారం ఉదయం10.30 గంటల నుంచి రాత్రి వరకు పోలీసులు విచారిస్తున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్, రూరల్ సీఐ ఎస్.షఫితోపాటు ఇతర అధికారులు సుదీర్ఘంగా లాయర్ల సమక్షంలో విచారించారు. పీఆర్కే, పీవీఆర్, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రామలక్ష్మణరెడ్డి, న్యాయవాదులు బి.నాగిరెడ్డి, సీహెచ్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: జల వనరుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన వివిధ పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని పనులకు సంబంధించి శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు సర్కిల్ పరిధిలోని బాపట్ల జిల్లాలో సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని భూములకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 716 పనులు చేపట్టినట్లు, వాటిలో 148 పూర్తి అయ్యాయని, మిగతా పనులు పలు దశలలో ఉన్నాయని జిల్లా వాటర్ రీసోర్సెస్ అధికారి అబా అబుతలీమ్ ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు.

'జీఎస్టీ తగ్గింపు' ప్రయోజనాలపై హెల్ప్ డెస్క్

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై జిల్లా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. జీఎస్టీ కమిషనర్ మురళీకృష్ణతో కలసి శనివారం జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్కును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు, జీఎస్టీ కమిషనర్ మురళీకృష్ణ, డ్వామా పీడీ విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావులతో కలసి కరపత్రాలను విడుదల చేశారు.

వసతుల కల్పనకు చర్యలు

జిల్లాలో పర్యాటకాభివృద్ధిలో భాగస్వాములయ్యే సంస్థలకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం పర్యాటక శాఖ అధికారులు, పలు సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు.

చెత్త తరలించాలి

బాపట్ల డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలను నిర్దిష్ట కాలపరిమితిలోపు నిర్దేశిత ప్రాంతానికి తరలించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం బాపట్ల జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు.

ట్రాక్టర్ కింద నలిగిన రెండు ప్రాణాలు

- ఇరువురి మృతికి కారణమైన డ్రైవర్ మద్యం మత్తు
- కూలీ కోసం వెళ్తున్న వారిని ఎక్కించుకోగా దుర్ఘటన



ప్రమాద స్థలంలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు



నర్సమ్మ (ఫైల్)



స్వరూపరాణి (ఫైల్)

అద్దంకి: డ్రైవర్ మద్యం మత్తు కారణంగా రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. ట్రాక్టరు కింద పడి కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని తిమ్మాయపాలెంలోని దర్శి-అద్దంకి రహదారిలో శనివారం చోటుచేసుకుంది. మృతుల బంధువుల కథనం మేరకు.. తిమ్మాయపాలెం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వేము నరసమ్మ (60), కొప్పోలు స్వరూపారాణి (47)లు ప్రకాశం జిల్లా పోలవరం గ్రామంలో కూలీ పనుల కోసం వెళ్తున్నారు. గ్రామంలోని బట్టీ వద్ద ఇటుకలు లోడు చేసుకుని ఓ ట్రాక్టర్ దర్శి వైపు వెళ్తోంది. ఇటుక ఎత్తిన కూలీలను గ్రామంలో దించాక దర్శి రహదారిలో ట్రాక్టర్‌ను డ్రైవర్ రవి నడుపుతున్నాడు. అటుగా వెళ్తున్న నలుగురు కూలీలను ట్రాక్టర్‌లో ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లిన తరువాత అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. ఒక వైపు బానెట్‌పై కూర్చుని ఉన్న నర్సమ్మ, స్వరూపారాణి జారి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. అదే సమయంలో రోడ్డుపక్కన ఇంటి ముందు పని చేసుకుంటున్న టి. శ్రీనివాసరావు ఇంకుడు గుంతలో కూర్చోవడంతో గాయాలు మాత్రమే అయ్యాయి. ఆయన్ను వైద్యశాలకు తరలించారు.

మద్యం మత్తులో డ్రైవర్..

నర్సమ్మకు ముగ్గురు పిల్లలు. ఐదు సంవత్సరాల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. స్వరూపారాణికి భర్త రవి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కాలనీకి చెందిన ఇరువురు మృతి చెందడంతో బంధువులు, స్థానికులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. అదే ట్రాక్టర్‌పై ఉన్న మరో ఇరువురు కూలీలు తెలిపిన వివరాల మేరకు.. బస్సు కోసం వేచి చూస్తున్న కూలీలను ట్రాక్టర్ డ్రైవర్ పిలిచాడన్నారు. మద్యం మత్తుగా ఉన్నాడని, దాంతోనే ప్రమాదం జరిగిందని చెప్పారు. తాము రెండో వైపు ఉండడంతో బతికామని పేర్కొన్నారు. ఇరువురు కిందపడ్డారని కేకలు వేసినా డ్రైవర్ పట్టించుకోలేదని వాపోయారు. రోజూ తమతో కూలీ పనులు చేసుకునే ఇద్దరు తమ కళ్లముందే మృత్యువాత పడడంతో నోట మాట రాలేదని కన్నీటిపర్యంతం అయ్యారు. డ్రైవర్‌కు మృతుల బంధువులు దేహశుద్ధి చేశారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నష్టపరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మృతుల బంధువులు, దళిత సంఘాల నేతలు శనివారం రాత్రి ఆందోళన చేశారు.

నిండుకుండలా కృష్ణమ్మ



కొల్లూరు మండలం పెసర్లంక - గాజుల్లంక గ్రామాల నడుమ ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

- తగ్గినట్టే తగ్గి ఉగ్రరూపం దాలుస్తున్న వరద ప్రవాహం
- నేడు 5 లక్షల నుంచి 6 లక్షల క్యూసెక్కులకు చేరొచ్చని అంచనా

కొల్లూరు: కృష్ణమ్మ నిండుకుండలా ప్రవహిస్తోంది. పంటలు ముంపు బారిన పడతాయన్న ఆందోళన రైతాంగాన్ని పట్టి పీడిస్తోంది. శనివారం ఉదయం ప్రకాశం బ్యారేజ్ నుంచి 2,26,293 క్యూసెక్కులకు నీటి విడుదల పరిమితం కావడంతో వరద ప్రభావం తగ్గిందని ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మధ్యాహ్నం నుంచి వరద తీవ్రత గణనీయంగా పెరుగుతూ వచ్చింది. సాయంత్రానికి 1,58,232 క్యూసెక్కులు... తర్వాత 3,84,525 క్యూసెక్కులకు చేరింది. ప్రకాశం బ్యారేజ్‌కు శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరద నీటికి తోడు హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా మూసీ నది, తెలంగాణలోని ఖమ్మం ప్రాంతం నుంచి ప్రవహించే మున్నేరు వరద కూడా ఉధృత రూపం దాల్చడంతో నదిలో వరద క్రమంగా అధికమైంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి 3.75 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి వదలడం కారణంగా మండలంలోని పెసర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం గ్రామాల చుట్టూ నీరు చుట్టుముట్టింది. దోనేపూడి లోలెవల్ చప్టాపై వరద ప్రవాహం కొనసాగుతుండటంతో పది లంక గ్రామాల ప్రజలు రాకపోకలకు చుట్టు మార్గంలో ప్రయాణించాల్సి వస్తోంది. ఆదివారానికి 5 లక్షల నుంచి 6 లక్షల క్యూసెక్కులకు నీటి విడుదల చేరవచ్చునని ఆర్సీ, నీటిపారుదల శాఖాధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నీటి విడుదల పరిమాణం పెరిగిన పక్షంలో శనివారం అర్ధరాత్రి నుంచి బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. ఆదివారం రెండో ప్రమాద హెచ్చరిక సైతం వెలువడవచ్చునని అధికారులు పేర్కొన్నారు.

ఇంట్లో అర కిలో బంగారం, వెండి చోరీ

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో అరకిలో బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైన ఘటన శనివారం వెలుగు చూసింది. బాధితుల వివరాల మేరకు.. వలపర్లకు చెందిన కారంపూడి కొండలు, నాగిని దంపతులు వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు స్థానిక సినిమా హాల్ సెంటర్ సమీపంలో గ్రామానికి దూరంగా ఇటీవల కొత్తగా ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. దసరా సెలవులు ప్రారంభం కాగానే గత ఆదివారం ఇద్దరు కలిసి కర్ణాటక రాష్ట్రంలో ఉంటున్న తమ కుమార్తెను చూడటం కోసం వెళ్లారు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చిన కొండలు దంపతులు ఇంటి తలుపులకు వేసిన తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించారు. లోపల వైపు తలుపులు బీరువాలు ధ్వంసం చేసి ఉండటానికి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ, బల్లి కురవ ఎస్సైలతో కలిసి ఘటనా స్థలిని పరిశీలించారు.



వలపర్లలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

బాధితులకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి
- సీఐ దాడిలో గాయపడిన యువకులకు పరామర్శ



బాధిత యువకుల ఆరోగ్య విషయమై వైద్యుడితో మాట్లాడుతున్న గాదె మధుసూదనరెడ్డి

మార్టూరు: బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని.. ఎవరూ అధైర్య పడొద్దని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి అన్నారు. శనివారం మార్టూరు మండలంలోని డేగరమూడి గ్రామానికి చెందిన దళిత యువకులు ప్రమోద్, పోతులూరిలను పరామర్శించారు. మార్టూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన దళిత యువకులను మార్టూరు సీఐ మద్దినేని శేషగిరిరావు అత్యంత క్రూరంగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురిచేసిన ఘటనకు స్పందించిన ఆయన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం యాక్టివ్‌గా ఉన్న వారిపై రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చి అక్రమ కేసులు బనాయించారన్నారు. వారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో టీడీపీ ఫ్లెక్సీని చించివేశారంటూ పోలీసే స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేసి ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారం శాశ్వతం కాదు..

నిజంగా తప్పు చేస్తే కేసు ఫైల్ చేసి శిక్షించాలిగానీ, వారిని ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన అధికారులను ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చిపోతుంటాయని చెప్పారు. దానిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు నడుచుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనను ఇంతటితో వదిలిపెట్టకుండా రాష్ట్ర వ్యాప్తంగా అందరం కలిసికట్టుగా పోరాడి బాధితులకు అండగా నిలుస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో తమ పార్టీ నాయకులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వాసు, మార్టూరు మండల పార్టీ కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి ఉప్పలపాటి అనిల్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం, మార్టూరు టౌన్ అధ్యక్షుడు అడకా గంగయ్య, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి అట్లూరి వెంకయ్య, మండల ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, మైలా నాగేశ్వరరావు, బూరగ రాము, తమ్ములూరి సురేష్, రాజుపాలెం అంజిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్న నాయక్, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ సకాలంలో పూర్తి కాకపోతే చర్యలు

సెర్ప్ అడిషనల్ సీఈవో ఆర్. శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

బాపట్ల టౌన్: మొబైల్ బుక్ కీపింగ్ నూరు శాతం పూర్తిచేయని వీఓఏలకు గౌరవ వేతనాలు నిలుపుదల చేస్తామని సెర్ప్ అడిషనల్ సీఈవో ఆర్. శ్రీరాములు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు సిబ్బందితో కలిసి శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఈటీసీ కార్యాలయంలో జిల్లాలోని 25 మండలాల ఏపీఎం, డీపీఎం అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 30 నాటికి మొబైల్ బుక్ కీపింగ్‌ని 100% పూర్తి చేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. లవన్న మాట్లాడుతూ జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు గురించి గ్రూపు సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సెర్ప్ అధికారి ఎల్.వాల్మీకి, డీపీఎంలు, ఏపీఎంలు, స్త్రీ నిధి సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

జిల్లా కేర్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు

చినగంజాం: మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, జిల్లా కేర్ కమిటీ కన్వీనర్ బి. వెంకటేశ్వర్లు సూచించారు. చినగంజాంలోని డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌లో శనివారం మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలైన వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పాడై పోవడమే కాకుండా ప్రాణాలను కోల్పోతారని తెలిపారు. వారిని నమ్ముకున్న కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని సూచించారు. కార్యక్రమంలో చీరాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి. నాగేశ్వరరావు, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రామారావు, చినగంజాం ఏఎస్ఐ జి. శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ పి.పద్మావతి, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి. సాయిశ్రీ చరణ్ సైదారెడ్డి, నాగూరు బాషా పాల్గొన్నారు.

ఆట్యాపాట్యా రాష్ట్ర క్రీడల్లో గుంటూరుకు తృతీయ స్థానం



బాలుర జట్టు



బాలికల జట్టు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆట్యాపాట్యా క్రీడా పోటీల్లో గుంటూరు జిల్లా బాలబాలికల జట్లు తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని గుంటూరు జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ కార్యదర్శి దావులూరి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఆట్యా-పాట్యా చాంపియన్ షిప్-2025 పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఈ విజయాలు నమోదు చేశారన్నారు. క్రీడాకారులను ఏపీ ఆట్యా-పాట్యా సీఈవో రంభ ప్రసాద్, కార్యదర్శి శ్రీ చరణ్, గుంటూరు జిల్లా అధ్యక్షులు కాళ్ల విజయ్‌కుమార్ తదితరులు అభినందించారని తెలిపారు.

భక్తి రసానందం పద్యనాటకాలు



శ్రీవెంకటేశ్వర మహోత్మ్యం పద్యనాటకలో సన్నివేశం



నల్లత్రాచు నీడలో సాంఘిక నాటక సన్నివేశం

తెనాలి: కళల కాణాచి, తెనాలి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయ పంచమ పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు 'వీణా అవార్డ్స్-2025' శనివారం ఇక్కడ ప్రారంభమయ్యాయి. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ప్రముఖ నటీమణి, పట్టణ కళాకారుల సంఘం అధ్యక్షురాలు, బుర్రా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలనతో పోటీలను ఆరంభించారు. తొలిగా టీజీవీ కల్చరల్ అకాడమీ, కర్నూలు వారి 'శ్రీవెంకటేశ్వర మహాత్మ్యం' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. శ్రీవెంకటేశ్వరుడిపై అమిత భక్తిభావం కలిగిన అనంతాచార్యుడు స్వామివారి కైంకర్యాలు కోసం నియమితుడవటం, అందుకోసం ఆయన పడే కష్టాలు, చివరకు శ్రీవేంకటేశ్వరుడే మారురూపంలో వచ్చి సాయం చేయటం కథాంశం. శ్రీవెంకటేశ్వరుడుగా టి.రాజశేఖరరావు, అనంతాచార్యులుగా జె.మోహన్ నాయర్, మహాలక్ష్మిగా సురభి హారిక కార్తిక్, అలిమేలు మంగమ్మగా సురభి వెంగమాంబ నటించారు. సంగీతం పీజీ వెంకటేశ్వర్లు, శారదా ప్రసన్న రచనకు వీవీ రమణారెడ్డి దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు అండ్ లలిత కళాపరిషత్, అనంతపురం వారి 'కాలభైరవ సంహారం' పద్యనాటకాన్ని ప్రదర్శించారు. కీ.శే పోతులయ్య రచనకు రామగోండ్‌సాగర్ దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణుడుగా గంటా శివశంకర్, కాలభైరవుడుగా దాసరి దయానంద్, దుర్యోధనుడుగా సోమర లక్ష్మీనారాయణ, నారదుడుగా సి.శ్రీరాములు, ద్రౌపదిగా ఎస్.విజయశారద నటించారు. రాత్రి చివరి ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి 'నల్లత్రాచు నీడలో' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. రచన, దర్శకత్వం శ్రీనివాసరావు పోలుదాసు, ప్రధాన పాత్రల్లో దర్శకుడు శ్రీనివాసరావు, సురభి లలిత, పవన్‌కళ్యాణ్, షణ్ముఖి నాగుమంత్ర, గోవర్ధనరెడ్డి, చైతన్య నటించారు.

సాగర్ కాల్వలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు

వారిలో ఒకరు మృతి, ఇద్దరిని కాపాడిన స్థానికులు



మృతి చెందిన విద్యార్థి సత్తార్

కారెంపూడి: సాగర్ కుడి కాల్వలో సరదాగా ఈత కొడదామని యత్నించిన ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు మునిగి మృతి చెందిన ఘటన స్థానిక వినుకొండ రోడ్డు బ్రిడ్జి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వాసు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సరావుపేటకు చెందిన సయ్యద్ సత్తార్, ఖాదర్ వలి, నాగుల్ మీరాలు పదవ తరగతి చదువుతున్నారు. దసరా సెలవలు కావడంతో సయ్యద్ సత్తార్ ఇద్దరు మిత్రులతో కలసి కారెంపూడిలో ఉంటున్న పెద్దమ్మ జహీరా ఇంటికి వచ్చారు. బట్టలు ఉతికేందుకు వెళ్తున్న పెద్దమ్మ జహీరాతో పాటు వారు కూడా సాగర్ కాల్వ వద్దకు వచ్చారు. ఈత కొడదామని సరదా పడి ముగ్గురు కాల్వలో దిగారు. ప్రవాహ వేగానికి ముగ్గురు మునిగి కొట్టుకుపోతుండగా జహీరా పెద్ద పెట్టున ఏడుస్తూ కేకలు వేయడంతో ఆ సమీపంలో ఉన్న స్థానికులు గమనించి ఇద్దర్ని కాపాడి ఒడ్డుకు చేర్చారు. సయ్యద్ సత్తార్‌ను ఒడ్డుకు చేర్చేసరికే (15) ప్రాణాలు విడిచాడు, ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రులు బంధువులు తల్లడిల్లిపోతున్నారు. నర్సరావుపేటకు చెందిన సయ్యద్ రహీమ్ వ్యవసాయదారుడు, ఆయనకు కుమారుడు కుమార్తె ఉన్నారు. కుమారుడు సత్తార్ కారెంపూడిలో ఉన్న తన అక్క దగ్గరకు సెలవుల్లో సరదాగా గడిపేందుకు వచ్చి ఇలా తనువు చాలించడంతో అందరు శోకసంద్రంలో మునిగిపోయారు. గురజాలలో పోస్టుమార్టం అనంతరం సయ్యద్ సత్తార్ మృతదేహాన్ని ఎస్ఐ వాసు బంధువులకు అప్పగించారు.

డ్వాక్రా రుణాలపై నివేదిక ఇవ్వండి

నరసరావుపేట: జిల్లాలో అందిస్తున్న డ్వాక్రా రుణాలు, చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రణాళికపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలు కోరిన రుణాలు, బ్యాంకుల వారీగా మంజూరైన రుణాలు, పెండింగ్‌లో ఉన్న రుణాలు, రుణాల మంజూరుకు ఎదురవుతున్న సమస్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. డ్వాక్రా మహిళలకు పరిశ్రమలు స్థాపించడం, నిర్వహించడంపై అవగాహన కల్పించేందుకు విజయవంతమైన సంస్థల సందర్శన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

తల్లిని హత్య చేసిన తనయుడి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల టౌన్: మండల పరిధిలోని పూండ్ల గ్రామంలో తల్లిని హత్య చేసిన తనయుడిని బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం బాపట్ల రూరల్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జి. రామాంజనేయులు వివరించారు. పూండ్ల గ్రామానికి చెందిన పెనిమిటి రమణమ్మ పారిశుద్ధ్య ఎస్‌డబ్ల్యూ షెడ్‌లో రెండో భర్త శ్రీనివాసరావుతో కలిసి పని చేస్తోంది. మొదటి భర్త చనిపోవడంతో ఆమె రెండో వివాహం చేసుకుంది. మొదటి భర్తకు ఇద్దరు సంతానం ఉన్నారు. షెడ్‌లో పనిచేస్తున్న వారికి గత కొన్ని నెలలుగా జీతాలు రావడం లేదు. అయితే, ఇటీవల జీతం ఒక్కసారిగా రూ. 42,000 రావడంతో అదే షెడ్డు వద్ద రెండవ భర్తతో కలిసి మృతురాలు, కొడుకు మద్యం తాగుతున్నారు. మృతురాలి కొడుకు జాలయ్య మందు తాగడానికి డబ్బులు అడగడంతో నిరాకరించింది. దీంతో పక్కనే ఉన్న ఇనప రాడ్డుతో తలపై కొట్టి హత్య చేశాడు. మృత్యురాలి భర్త శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకొని అన్ని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు జాలయ్య హత్య చేసి పారిపోగా చుండూరుపల్లిలో శనివారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ కె. శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.